# అనుకోని ముచ్చట

కథ

అన్నయ్యా! ఏం ఈవాళ ఇంత ఆలస్యం చేశావేం? నేనేమి ఇక్కడ ఒంటిగా ఎంతసేపని ఉండాలి" అని ఏమేమో అంటూ తలుపు తెరిచింది సుశీ. తలుపు తెరచిన తరువాత అన్నయ్యతో కూడా ఒక వ్యక్తి ఉండటం చూసి నాలుక కరచుకొంది. ఆ వచ్చిన వ్యక్తీ, అన్నయ్యా ఏదో నవ్వుకుంటూ లోపల కడుగుపెట్టారు. అన్నయ్య తన గదిలోనికి తీసుకపోయాడు అతిథిని.

"అబ్బ! ఎవరతను? ఎంత అందంగా ఉన్నాడు! ఆ చిరునవ్వు ఎంత ఆహ్లాదంగా ఉంది!" అని ఏదో ఆలోచించుకుంటూ సుశీ అక్కడే సోఫాలో కూర్చుండి పోయింది. ఇంతలో "బాబుగారు, కాఫీ మిమ్మల్ని తెమ్మని చెప్పారమ్మగారూ" అని వంటమనిషి సుబ్బమ్మ ట్రే అక్కడ ఉంచేసి వెళ్ళిపోయింది. ఏదో తెలియని ఆనందం సుశీ హృదయాన్ని ఆవరించేసింది. ట్రే తీసుకొని మెల్లగా అన్నయ్య గదివద్దకు చేరింది. అన్నయ్యా, అతని మిత్రుడు ఏదో మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు. సుశీల గదిలో కడుగుపెట్టేసరికి ఎందుకో ఏమో సిగ్గు ఒక్కసారిగా ముంచుకొచ్చింది. తలుపు వద్దనే ఆగిపోయింది. వళ్లంతా ఎందుకో చెమటపోసింది.

"రా సుశీ! వీడు మెడ్రాస్‌లో నాక్లాసు మేటు. పేరు చంద్రం. ఈమె మాసిస్టర్ సుశీ, చంద్రం" అంటూ సత్యం పరిచయం చేశాడు ఒకర్నొకరికి.

"నమస్కారమండి సుశీలగారూ" అన్నాడు చంద్రం చిరునవ్వుతో.

"చంద్రం! ఆహా! ఎంతబాగుంది పేరు. ఆ చిరునవ్వెంత చక్కగా ఉంది" అని అనుకోడంలో ప్రతినమస్కారం చేయడం మరచిపోయింది సుశీ.

"కాఫీ తీసుకోరా" అని సత్యం అడ్డు పడడంతో సుశీ, చంద్రం కూడ సర్దుకున్నారు. ఇదంతా ఒక్కక్షణంలో జరిగిపోయింది. ముగ్గురూ ఏదో మాటల్లో పడిపోయారు. సత్యం, చంద్రం, తమ కాలేజివిషయాలు ఏవో మాట్లాడుకుంటూన్నారు. అన్నయ్యా, చంద్రం మెడ్రాస్‌లో క్లాసుమేట్సట. అలాంటి స్నేహితుడొకడున్నాడని అన్నయ్య ఇంతవరకు చెప్పనేలేదే. చంద్రం హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడట. నెలకు మూడువందలు సంపాదనట. ఇంకా అతడు పెళ్లెందుకుచేసుకోలేదో? పెళ్లి ఎప్పుడు చేసుకుంటాడో! ఎవర్ని పెళ్లాడతాడో? ఈఆలోచన వచ్చేసరికి సుశీ ముఖం వికసించింది. పెదవుల్లో ఎందువల్లో ఒక చిరునవ్వు మెరిసింది. లేతాకుపచ్చ జార్జెట్ చీరపైట చటుక్కున జారిపోయింది. పైట సర్దుకుంటూ సుశీ చంద్రంవైపు చూచింది. చంద్రంకూడ తనవైపే చూస్తున్నట్టు గమనించేసరికి సుశీబుగ్గలు ఎఱ్ఱబారినవి. సుశీకెందుకో చంద్రం ఎంతో ఆప్తుడుగా కనిపించాడు.

ఆరోజు ముగ్గురుకలసి సినిమాకిబయలుదేరారు. చంద్రం మాట్లాడుతుంటే అలాగే వినాలనిపించేది సుశీకి. ఇంటర్వెల్‌లో

కె. యస్. సువర్ణ

సత్యం అవతలికెళ్ళినపుడు చంద్రం అడిగాడు "ఏమండి సుశీలగారూ! నాటకమేలా ఉంది," అని. సుశీ ఈసారయిన గట్టిగా మాట్లాడాలని తలచి "అబ్బే! ఇది సినిమా కదండి" అనగలిగింది.

"అదేలెండి! ఇపుడు నాటకమే జరుగుతూంట" అన్నాడు చంద్రం. సుశీ ఏదో ఆలోచిస్తు అవ్యక్తానందంతో బదులు చెప్పలేకపోయింది. మరునటి రోజే చంద్రం ఇద్దరి దగ్గర సెలవు తీసుకొని హైదరాబాదు వెళ్లిపోయాడు. సుశీ చాల బాధ పడింది.

* * *

రిక్షాలో కూర్చొని పోతోందేగాని, సుశీ ఆలోచనలు రిక్షాకంటె, రైలుకంటె, విమానంకంటె వేగంగా పరిగెడుతున్నాయి. కాలేజిమీద మనస్సే లేదు. క్లాసులో కూర్చొని ఉందికాని లెక్చరర్ చెప్పేదేమీ బుర్రలో కెక్కడమేలేదు. "ఏమే అట్లా ఉన్నావు" అని కమల ప్రశ్నించినపుడు "ఏమీ లేదండి." కాని కమలే అందుకుంది, "ఏం ఎవరినయినా మోహించావా ఏం" అని. సుశీ జవాబు చెప్పలేకపోయింది. ఒక చిక్కని చిరునవ్వుతో ఊరుకుండి పోయింది.

కాలేజినుండి తిరిగొచ్చేసరికి సత్యం ఏదో ఉత్తరం చదువుతున్నాడు. సుశీని చూచి గబుక్కున దాచేయబోయినట్లు నటించాడు.

"ఎక్కడినుంచి అన్నయ్యా ఉత్తరం" అంటూ వంగి చూడబోయింది.

"నీకు చూపించకూడదు ఇది. ఇందులో గొప్ప గొప్ప విషయాలున్నాయి" అని సత్యం ఉత్తరం బయటికి చూపించి మరి దాచబోయాడు. సుశీ గబుక్కున ఉత్తరం లాక్కొని తనగదిలోకి వెళ్లిపోయింది.

ఉత్తరం చదువుతూంటే సుశీల మనస్సు గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. ఆ ఉత్తరం నాన్నే వ్రాశాడు. అన్నయ్యకు వ్రాసి ఉంది. సుశీ నడిగి అబ్బాయి నచ్చాడో లేదో వ్రాయాలట. అమ్మకునాన్నకు అబ్బాయి నచ్చారట. అమ్మాయి అంగీకరిస్తే ముహూర్తం వచ్చే మాసములో పెట్టిస్తారట. సుశీల కంతులేని ఆశ్చర్యం, అన్నయ్యమీద కోపం కలిగింది. ఇంతలో సత్యం తలుపు దగ్గర నిలబడి "ఏం సుశీ ఉత్తరం అలా లాక్కొని పోయావేం? ఏముంది అందులో?" అన్నాడు.

"పో అన్నయ్యా! ఇంత నాటకమెందుకాడారు నీవు మీ ఫ్రెండూ కలసి" అంది సిగ్గుపడుతూ.

"నాటకము జరుగుతూందంటే కాదన్నావటగా మా ఫ్రెండుతోటి" అన్నాడు సత్యం.

"ఓహో! అది కూడా చెప్పారా? భలే వాడేనే మీ ఫ్రెండు!"

"ఇంతకీ నాన్నకేం జవాబు వ్రాయాలి" అని సత్యం నవ్వాడు.

"పో అన్నయ్యా! ఇంకా వేళాకోళాలాడకు. ఏదో ఒకటి వ్రాసేయి," అంది జారిపోయిన లేతాకుపచ్చ జార్జెటు చీరపైట సర్దుకుంటూ సుశీ. ★

## న్యూఢిల్లీ లేఖ

ఆంధ్ర పత్రిక న్యూఢిల్లీ ప్రతినిధి శ్రీ శ్రీ కృష్ణ అమెరికా పర్యటనార్థం బయలుదేరి వెళ్లారు గనుక 'న్యూఢిల్లీ లేఖ' తాత్కాలికంగా నిలుపు చేయవలసి వచ్చిందని పాఠకులకు మనవి. శ్రీ శ్రీ కృష్ణ అమెరికా నుండి తిరిగి రాగానే, న్యూఢిల్లీ లేఖ యథాప్రకారం ప్రకటింప బడుతుంది. సం॥.